## కథ

# కందిమహల్

**ప్రఫుల్లచంద్ర**

శ్రీమహాలక్ష్మమ్మ గుడ్లురిమితే కాకి గోల ఆగిపోతుంది. మొరుగుతున్న కుక్కలు పారిపోతాయి. మనుషులనగా ఎంత! భర్త శ్రీపతి మీసాలు కిందికి దించేసి తల వాల్చేస్తాడు. కొడుకులు కొయ్యబారిపోతే, కోడళ్లు కొండపల్లి బొమ్మలూ, మనవలు బొమ్మరాళ్లూ అయిపోతారు! ఆమె ఒక్కతే పదిమంది సూర్యకాంతంల పెట్టు.

ఆ ఇంట్లో ఎప్పుడూ శ్రీ తాండవిస్తుంది. ఎందుకంటే ఆమె పేరు శ్రీమహాలక్ష్మమ్మ. భర్త శ్రీపతి, కొడుకులు శ్రీధర్, శ్రీనాథ్, శ్రీకాంత్. మరి కోడళ్లు శ్రీదేవి, శ్రీలక్ష్మి, మనవలు శ్రీనివాస్, శ్రీకర్, శ్రీరత్న, శ్రీమాణిక్య! ఆ యింటి పేరే శ్రీ నిలయం!

ఆ ఇంట్లో అడుగుపెట్టగానే పొడవాటి హాలు. దానిని ఆనుకొని మూడు బెడ్‌రూంలు-ముగ్గురు కొడుకుల కోసం. కానీ ఆ దౌర్భాగ్యుడు పెద్దకొడుకు శ్రీధర్ ఇరవై ఏళ్ల క్రితమే తల్లిని ఎదిరించి ప్రేమ వివాహం అంటూ బయటకు పోయాడు. ఆ పెళ్లాం తన్ని తగిలేస్తే వాడు మళ్లీ తన చెంతకే చేరుతాడని ఎదురుచూస్తూనే ఉంది శ్రీమహాలక్ష్మమ్మ. అందువల్ల పెద్దకొడుక్కి కేటాయించిన గదిలో వృద్ధదంపతులే ఉంటున్నారు. మిగిలిన రెండు గదుల్లో ఇద్దరు కొడుకులూ వారి పెళ్లాంబిడ్డలూ.

బెడ్‌రూం వన్, టూల తలుపుల మధ్య స్థలంలో హాలులో ఒక దివాన్, దానిమీద స్పాంజ్ బెడ్. అటూ ఇటూ పొడవాటి గుండ్రని బాలీసులు. గోడకు చేర్చి మూడు దిళ్లు.

ఆ సింహాసనం అచ్చంగా శ్రీమహాలక్ష్మమ్మదే. రోజంతా ఆమె ఆ సింహాసనాన్ని అధిష్టించి అటూ ఇటూ అలవోకగా వంగుతూ ఆ కుటుంబాన్ని పరిపాలిస్తూ ఉంటుంది. ఆమె ఇంట్లో ఉన్నా లేకున్నా ఆ సింహాసనం మీద ఎవరూ కూర్చోకూడదు!

"ఆంటీ! ఆంటీగారండీ!"

పిలుపు విని సింహాసనం దిగి తలుపు తెరిచింది శ్రీమహాలక్ష్మమ్మ. ఎదురుగా ప్రసన్నలక్ష్మి! తమ ఇంటి ప్రక్కనే చూడచక్కని మూడంతస్తుల మేడ కట్టిస్తున్నదామె. వాళ్లాయన అస్సలు తీరికలేని బిజినెస్ మాన్ అట. అందుకని ఆమె కారులో వచ్చి షామియానా కింద కుర్చీలో దర్జాగా కూర్చుని నిర్మాణం పర్యవేక్షిస్తూ ఉంటుంది.

అడపాదడపా ఇంటికొచ్చి శ్రీమహాలక్ష్మమ్మతో కాసేపు కబుర్లు చెబుతుంది. ఇంటి నిర్మాణ సమస్యలు చెప్పుకుంటుంది. మంచినీళ్లు తాగి కారులో వెళ్లిపోతుంది.

ఆమె తమ ఇంటికొస్తే చాలు సాక్షాత్తూ ఆ శ్రీమహాలక్ష్మి వైకుంఠం నుంచి నడిచినట్లు ఉప్పొంగిపోయి మర్యాదలు చేస్తుందీ శ్రీమహాలక్ష్మమ్మ!

"హమ్మయ్య! మీ దయవల్ల ఇల్లు పూర్తయింది ఆంటీ! గృహప్రవేశమే తరువాయి" అందామె సంతృప్తిగా. ఆమెను కుర్చీలో కూర్చోబెట్టి కోడలి చేత మజ్జిగ తెప్పించి ఇచ్చింది శ్రీమహాలక్ష్మమ్మ.

ఇల్లు పూర్తవడంతో ఇప్పుడు ప్రసన్నలక్ష్మి ఆనందలక్ష్మిలాగా మెరిసిపోతోంది. ఆ మేడకు యాభై లక్షలయిందట. దానికి కంది మహల్ అని పేరు పెట్టారట.

అదేం పేరని ఆశ్చర్యపోయినా బహుశా కంది ఆమె ఇంటి పేరు కాబోలు అనుకుంది శ్రీమహాలక్ష్మమ్మ.

కందిమహల్ కాక వారికి పెద్ద నగరాల్లో షాపులూ మేడలూ ఉన్నాయట. కోటీశ్వరురాలైనా ఇసుమంత గర్వం లేకుండా ఎంత వినయం! ఎంత ఒద్దిక! అని మురిసిపోయింది శ్రీమహాలక్ష్మమ్మ. ఆమె తన జీవితంలో మెచ్చుకున్న మొదటి వ్యక్తి ప్రసన్నలక్ష్మే!

కాసేపు కబుర్లు చెప్పి ఆమె కారులో వెళ్లిపోగా శ్రీమహాలక్ష్మమ్మ సింహాసనం అధిష్టించి గర్జించింది. కోడళ్లిద్దరూ గజగజలాడుతూ వచ్చి ఎదురుగా నిల్చున్నారు. ప్రసన్నలక్ష్మిని చూసిన కళ్లతో చూస్తే కోడళ్లు పరిచారికల్లాగ కనిపించారామెకు! వారి గజగజ అంతా పై పైనే. లోనమాత్రం తిట్టుకుంటున్నారని ఆమెకెప్పుడూ అనుమానమే.

ఆఫీసు వేళల్లో తప్ప కొడుకులిద్దరూ వారి గదుల్లో నిత్యబందీలే. గాలి రాని ఆ గదుల్లోనే మగ్గిపోతూ మనవలు చదువు నటిస్తూ మనసులో నాయనమ్మని తిట్టుకుంటూ ఉంటారు.

"ఏమే! వంటయిందా?" గద్దించింది శ్రీమహాలక్ష్మమ్మ.

కోడళ్లిద్దరూ గంగిగోవుల్లా తలలూపారు. ఎవరు తిన్నా తినకపోయినా రాత్రి ఏడున్నరకల్లా ఆమె భోజనం చేయవలసిందే. ఆ మహాదేవికి నైవేద్యం సమర్పించాకే మిగిలినవారి భోజనాలు.

కోడళ్లిద్దరూ ఉపచారాలు చేస్తూండగా ఠీవిగా భోజనం చేసి విలాసంగా సింహాసనం వద్దకొచ్చి షాక్ అయింది శ్రీమహాలక్ష్మమ్మ. ఎదురుగా తన సింహాసనం మీద బాసింపట్టు వేసుక్కూర్చున్న ఆ శాల్తీని చూస్తూనే అరికాలి మంట నషాళానికి అంటిందామెకు. అతనిని పరిశీలనగా చూశాక ఆమె హృదయంలో రేగుతున్న మహాగ్రహాన్ని వెనక్కి నెట్టేసి ఆనందం ముంచుకొచ్చింది గాని ఆ ఆనందం ఎంతోసేపు ఆగలేదు. దాన్ని నెట్టేసి మళ్లీ ఆగ్రహం ముంచుకొచ్చింది.

"ఏరా శ్రీధరం! ఇరవై ఏళ్లకు ఇప్పుడు ఇల్లు గుర్తుకొచ్చిందా? నీ దేభ్యం ముఖం చూసి నీ పెళ్లాం ఎప్పుడో గెంటేసి ఉంటుంది! ఈలోగా ఎంతమంది తన్ని తగిలేశారేం? చివరాఖరికి ఇక్కడికొచ్చిపడ్డావ్!" ఎదుటికుర్చీలో కూర్చుంటూ ఎగతాళిగా అంది శ్రీమహాలక్ష్మమ్మ.

ఆ ఆర్భాటానికి గదులలోంచి ఒక్కొక్కరూ బయటకొచ్చి మహాద్భుత దృశ్యాన్ని చూస్తున్నట్టు నిలబడిపోయారు. సింహాసనం ఇంకొకరికి వదిలేసి శ్రీమహాలక్ష్మమ్మ కుర్చీలో కూర్చోవడం అద్భుతమే కదా!

అమ్మ హేళనగా మాట్లాడినా చెక్కు చెదరని శ్రీధర్ నోళ్లు తెరచి చూస్తున్న తమ్ముళ్లు వారి భార్యాబిడ్డల వైపొకసారి చూసి పలకరింపుగా చిరునవ్వు పారేసి-

"అమ్మా! ఈ ఇరవై ఏళ్లలో నీ నోటిపదును తగ్గనే లేదు. నువ్వు మారనే మారవా అమ్మా!" అడిగాడు నవ్వుతూ.

ముఖం ధుమధుమలాడిస్తూ మౌనం వహించింది శ్రీమహాలక్ష్మమ్మ.


"ఇంటికి పెద్దకొడుకుని. నిన్ను పున్నామ నరకం

నుంచి రక్షించవలసిన వాడిని! ఇరవై ఏళ్ల తర్వాత కని పిస్తే నీకు కొంచెం కూడా ఆనందంగా లేదా అమ్మా!" మరో బాణం రువ్వాడు.

"నువ్వేం(ట్రా నన్ను రక్షించేది! నువ్వు నరకంలో పడకుండా చూసుకో చాలు!"

"ఇరవై ఏళ్ల క్రితం నేను ఇల్లు విడచి వెళ్లినప్పుడేం అనుకున్నానో తెలుసా అమ్మా? నువ్వు పోతే గానీ ఈ కుటుంబం బాగుపడదని! ఇప్పుడు వీళ్లు కూడా అలాగే అనుకుంటున్నారని నా అనుమానం!" గల గలా నవ్వేస్తూ తమ్ముళ్లవైపు చూసి అన్నాడు.

లేదు లేదన్నట్లు వాళ్లు తలలూపినా మనసులలో వాళ్లకి సంతోషంగానే ఉంది, శ్రీమహాలక్ష్మమ్మను ఎదిరించే



మొనగాడొచ్చినందుకు!

"నేను చచ్చానో లేదో చూడడానికొచ్చావ(ట్రా?" ఆగ్రహంతో ఊగిపోయింది.

"లేదమ్మా! నీకు తెలియకపోయినా నాకు ప్రేమంటే తెలుసు! నేను భార్యను ప్రేమిస్తున్నాను. నిన్నూ నాన్ననీ ప్రేమిస్తున్నా. తమ్ముళ్లనూ ప్రేమిస్తున్నా. అందుకే వచ్చాను" సీరియస్‌గానే అన్నాడు శ్రీధర్.

"హబ్బో! పేద కారిపోతోంది!" అచ్చు సూర్యకాం తంలాగే చేతులు తిప్పుతూ అంది శ్రీమహాలక్ష్మమ్మ.

"చూశావా అమ్మా! నీకు ప్రేమ అన్న పదం పల కడం కూడా రాదు. ప్రేమించడం తెలియదు. పిరికిదా నివి. ప్రేమిస్తే ఆ ప్రేమను అదనుగా తీసుకుని అందరూ నిన్ను ఉపేక్షిస్తారని భయం. అందుకే నియం తలాగా మారి భర్తని గుప్పిట్లో బంధించావు. ఇల్లు దాటితే చెయ్యిదాటిపోతారని కొడుకులకు దూరప్రాం తాల్లో మంచి ఉద్యోగాలొచ్చినా పంపకుండా ఈ ఊళ్లోనే చిన్న ఉద్యోగాలకు పరిమితం చేశావు. కోడళ్లు నీ కొడుకుల్ని లాక్కుపోతారన్న భయంతో వాళ్లని తిట్టి కొట్టి పాదాల కింద నొక్కిపట్టావు. కానీ చరిత్ర చెప్పేదే మంటే- నియంతలంతా అభద్రతా భావంతో ఆందో ళన చెందే పిరికివాళ్లే. వాళ్లుపోతే జనం సంతోషిస్తారు గానీ ఏడ్చేవాళ్లుండరు. మనం విజయం సాధించిన ప్పుడు చప్పట్లు కొట్టి మనకు బాధ కలిగినప్పుడు సాను భూతి చూపే నలుగుర్ని సంపాదించుకోలేకపోతే ఆ జీవితం ఎందుకమ్మా?"

శ్రీమహాలక్ష్మమ్మ అంతరాత్మకు తెలుసు వాడు చెప్పిందంతా నిజమే అని. కానీ పట్టు వదిలితే తనని దిక్కులేని దాన్ని చేసి కొడుకులు తుర్రుమంటారని ఆమె భయం.

"తేరగా మింగడానికొచ్చి ఉపన్యాసాలు దంచుతు న్నాడు. వీడికి రెండు ముద్దలు పడేయండే. మింగిపో తాడు" కోడళ్లను ఆదేశించిందామె.

శ్రీధర్ చిరునవ్వు వీడలేదు. సింహాసనమూ వీడ లేదు. ఈలోగా ప్రసన్నలక్ష్మి మళ్లీ వచ్చి నేరుగా సింహా సనం వద్దకెళ్లి అతని ప్రక్కన కూర్చుంది. ఆమె చొర వకు అందరూ నిర్ఘాంతపోయారు.

"అమ్మా! నీ పెద్దకోడలు!" ప్రసన్నలక్ష్మిని అమ్మకు పరిచయం చేశాడు శ్రీధర్. ఆనందాశ్చర్యాలతో అందరూ కెవ్వుమన్నారు.

అంతలో కారు దిగి ఏనుగు సైజు ట్రాలీ బ్యాగ్ ఈడ్చుకుంటూ లోనికొచ్చిన పిల్లల్ని పరిచయం చేశాడు "నీ మనవలు, హర్ష పదో క్లాసు, వర్ష ఎని మిది"

పింగాణీ బొమ్మల్లాగ అందంగా ఆరోగ్యంగా మెరి సిపోతున్న వాళ్లని చూడగానే శ్రీమహాలక్ష్మమ్మ గుండె లోంచి భయంభయంగా కాస్తంత ఆనందం తొంగి చూసింది.

హాలులో మల్లోకాలూ మునిగిపోతున్నా శ్రీపతి మాత్రం బెడ్‌రూం లోంచి బయటకు రాడు. అదే ఆయన స్వర్గం, నరకం కూడా! శేష తల్పశాయి లాగా మంచం మీద నిర్వేదంగా పవళించి భవిష్యత్తు వైపు చూస్తూ ఉంటాడు.

శ్రీధర్ ఆయన్ని హాలులోకి లాక్కువచ్చాడు. ఈలోగా ప్రసన్నలక్ష్మి ట్రాలీ బ్యాగ్ తెరిచింది. దాని లోంచి సూట్ తీసి తండ్రికిచ్చాడు శ్రీధర్. సూటు ధరిం చాలన్న తన చిరకాల వాంఛ తీరినందుకూ, పెద్దకొ డుకు వచ్చినందుకూ ఆయన ముసలి గుండెలో ఆనందం పోటెత్తింది. అదే ఊపులో తమ్ముళ్లకు రెడీ మేడ్ దుస్తులూ, అమ్మకు మరదళ్లకూ పట్టుచీరలూ, పిల్లలకు కాలిక్యులేటర్లు- అన్నీ ఖరీదైనవే ఇచ్చాడు.

ఆనందంతో అందరి ముఖాలూ బద్దలవుతు న్నాయి! కలా నిజమా అని ఉబ్బితబ్బిబ్బు అవుతు న్నారు. వారి ఆనందాలు హ్యాండీకామ్‌లో హర్ష చిత్రీక రిస్తోంటే డిజిటల్ కెమేరాతో ఫోటోలు తీసి చూపి స్తోంది వర్ష!

సూటు తొడుక్కుని మురిసిపోతున్న తండ్రిని సింహాసనం మీద కూర్చోబెట్టి తను అమ్మప్రక్కన కూర్చుని-

"నీ భవిష్యత్ భద్రత కోసం స్వార్థంతో నువ్వు వాళ్లని తొక్కిపట్టావుగానీ కాస్త స్వేచ్ఛనిస్తే వాళ్లకి నీ మీద ప్రేమ పెరిగేది. నిన్ను దేవతలాగా చూసుకునేవారు. ఇప్పటికైనా పట్టుసడలించి వాళ్లకి స్వేచ్ఛనివ్వు అమ్మా!" అన్నాడు శ్రీధర్.

శ్రీమహాలక్ష్మమ్మ ఆలోచనలో పడగా శ్రీధర్ చెప్పుకుపోతున్నాడు.

మామగారిచ్చిన డిపార్ట్‌మెంటల్ స్టోర్‌ని అభివృద్ధి పరచి ఈ ఇరవై ఏళ్లలో క్రమక్రమంగా హైదరాబాద్‌లో ఐదు, విజయవాడలో రెండు, విశాఖలో రెండు రాజమండ్రిలో ఒకటి రిటెయిల్ ఔట్‌లెట్‌లు ప్రారంభించాడట. ఇప్పుడు కోట్ల బిజినెస్, ఏడాదికి పది కోట్లు లాభం! ఐదు వందల కుటుంబాలకు తను యజమాని, కాదు దేవుడే! ఎందుకంటే తనకి-డబ్బు కానీ ప్రేమకానీ- ఇవ్వడంలోని ఆనందం, పంచుకోవడంలోని హాయి తెలుసు.


"బాగుపడాలంటే ఇంట్లోంచి పారిపోవాలని చెప్పనుకాని నా విషయంలో జరిగిందదే. లేకుంటే నేను కూడా తమ్ముళ్లలా చాలీ చాలని జీతం రాళ్లతో ఇరుకు ఇరుకుగా నీ కాళ్ల కింద పడి ఉండే వాడిని!" సగర్వంగా చెప్పాడు శ్రీధర్.

అమ్మ మాట్లాడలేదు.

"వంట చేస్తున్న గృహిణి కందిపప్పు అయిపోయిందని హఠాత్తుగా గుర్తిస్తుంది. అప్పటికప్పుడు ఆమె పచారీ కొట్టుకు వెళ్లి తెచ్చుకోలేదు. తెచ్చిపెట్టేవాళ్లు ఇంట్లో ఎవరూ లేరు. ఇలాంటి సమస్యను ఎదుర్కొనే గృహిణులు వేల సంఖ్యలో ఉంటారు. అలాంటి వారి సౌకర్యం కోసం రెండు మొబైల్ షాపులు ప్రారంభించాలని వచ్చాం అమ్మా! ఉదయమే ప్రతి ఇంటికీ లారీలో పచారీ సామాను తీసుకెళ్లి సప్లయి చేయడమే మా లక్ష్యం. మార్కెటింగ్‌లో వస్తున్న పెను మార్పు ఇది. తెల్లవారుతూనే ప్రతి ఇంటికీ వెళ్లి గృహిణులతో చక్కగా మాట్లాడుతూ, వారి విశ్వాసం పొంది ఒక సరుకు అడిగితే రెండు అమ్మే చాకచక్యంతో వ్యాపారాభివృద్ధి చేస్తే ఏ స్థాయికైనా ఎదగవచ్చు"

ఇదంతా శ్రీధర్ ఎందుకు చెబుతున్నాడో అర్థం కాలేదెవరికీ.

"తమ్ముళ్లూ! మీ జీతాలు ఇప్పుడు పది వేలు. నేను ఇరవై ఇస్తాను. అదనంగా అమ్మకాల మీద కమిషన్ ఉంటుంది. చెరొక మొబైల్ షాపు నిర్వహిస్తారా? నీతిగా నిజాయితీగా మీరు ఒళ్లువంచి పని చేయాలి. నీతి తప్పిన మరుక్షణం మిమ్మల్ని ఉద్యోగంలోంచి తొలగిస్తాను. నాతో కలిసి పని చేస్తారా?" విషయం బయటపెట్టాడు శ్రీధర్.




ఇంతవరకూ అమ్మ అదుపాజ్ఞల్లో నలిగిపోయిన తమ్ముళ్లకు తమ సమర్థత నిరూపించుకోవాలనిపించింది. అవకాశం తలుపు తట్టగానే అమ్మ పెర్మిషన్ అడగకుండానే సరే అనేశారు.

జీవితంలో తొలిసారి తన ఆమోదం అడగకుండా వాళ్లు స్వయం నిర్ణయం తీసుకున్నందుకు అమ్మ మనసు చివుక్కుమంది.

ఆమె భుజం మీద చెయ్యి వేసి నచ్చజెప్పే ధోరణిలో "వాళ్లకి కాస్త స్వేచ్ఛ నివ్వు అమ్మా! స్వతంత్రంగా బ్రతకనివ్వు. అందువల్ల నీ ప్రాధాన్యత తగ్గిపోదు. ఇనుమడిస్తుంది. అందరూ నిన్ను గౌరవిస్తారు. ఆదరిస్తారు. అందుకు నేను గ్యారంటీ! ఎవరి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు వాళ్లు అనుభవిస్తూ అందరూ కలిసి హాయిగా జీవించ దానికి గుర్తుగా ప్రక్కన కంది మహల్ నిర్మించాను. అది మా కోసమే. కందికాయ విప్పి చూస్తే దాని గింజలు సెపరేట్ అరల్లో స్వేచ్ఛగా పెరుగుతాయి. ఒక గింజకు మరో దానికీ సంబంధం లేనట్టు కనిపించినా ఒక అంతఃసూత్రం వాటిని కలిపి ఉంచుతుంది. ఆ విధంగానే మీరూ జీవించాలి. మీరు గ్రౌండ్ ఫ్లోర్‌లో తమ్ముళ్లు చెరొక అంతస్తులో ఎవరి బ్రతుకులు వారు బ్రతుకుతూ అవసరానికి అందరూ కలిసి ఒకరికొకరు సాయం చేసుకుంటూ హాయిగా ఉండండి. నేను హైదరాబాద్‌లో ఉండి తీరాలి కాబట్టి మీతో ఉండలేను. అప్పుడప్పుడు వస్తూ ఉంటాం. తలో ముద్దా పెడితే నాకు పూర్తి భోజనం అవుతుంది. సంతృప్తిగా ఉంటుంది" అని నవ్వేస్తూ మూడు తాళం చెవులూ అమ్మకిచ్చాడు శ్రీధర్.

అమ్మ కళ్లలో చివ్వున కన్నీళ్లు తిరగగా అందరి హృదయాల్లో కృతజ్ఞత వెల్లువెత్తింది.

## కోలీవుడ్‌లో సమీరా రెడ్డి

**తెలుగమ్మాయి అయిన సమీరారెడ్డి ముంబాయిలోనే పుట్టిపెరగటంతో హిందీ అమ్మాయిలానే రాణిస్తోంది. రెండు తెలుగు సినిమాల్లో కూడా నటించిన సమీరా త్వరలోనే తమిళ రంగంలోకి కూడా అడుగుపెడుతోందిట. సూర్య హీరోగా నిర్మాణం కానున్న సినిమాలో నటించడానికి సమీరా రెడ్డి అంగీకరించినట్టు కోలీవుడ్ సమాచారం చెబుతోంది. తెలుగులో చెప్పుకోదగిన విజయం సాధించలేకపోయిన సమీరకి తమిళనాట ఎలాంటి సక్సెస్ లభిస్తుందో!**

